సురా - రగులుకొనే రాక్షసిబొగ్గు : ఈశాన్య భారత్ రాజకీయార్థిక పరిచయం.

# అశాస్త్రీయ పరిచయం

కె. బాలగోపాల్

ప్రతీ ఉద్యమాన్నీ కేవలం శాంతిభద్రతలదృష్ట్యా చూసే రివిజనిస్టులు చేస్తున్న ఘోషను ఛేదించి ఈశాన్య భారతపు ఉద్యమాలకు సంబంధించిన 'అజ్ఞానపుటంతానికి' ప్రయత్నించటం మెచ్చుకోదగ్గ విషయం. పోరాటంలో తటస్థంగా ఉండకుండ ఒక పక్షం తీసుకోవడంగూడ మెచ్చుకోదగ్గ విషయమే. అయితే 'సురా' ఆశయాలు శ్లాఘనీయమే అయినా ఉత్పత్తి అయిన సరుకు చాలరకాలుగా అసంతృప్తికరం, తీవ్రంగా విమర్శకు గురికావలసినది. నక్సల్బరీతో కమ్యూనిస్టు ఉద్యమంలో 'తిరిగి జాతీయ సమస్యలపై చర్చలు చెలరేగే అవకాశం ఏర్పడింద'ని నమ్మే 'సురా' ఈ సమీక్షను గూడ ఆ చర్చలో భాగంగా గ్రహిస్తాడని ఆశిస్తాను.

ఈ పుస్తకం చదివే వారికెవరికైనా మొదటిగా స్ఫురించేది, రచయితకు జాతి ఉద్యమాలపట్ల 'వీక్‌నెస్' ఉందన్నవిషయం. రెండవది అతనికి ఈశాన్యభారతంలో నడుస్తున్న అన్ని ఉద్యమాలపట్ల సద్భావం ఉందన్నవిషయం. అయితే మార్క్సిస్టు దృక్పథంలో జాతిఉద్యమాలకు ఒక విశిష్ట స్థానంలేదు. అన్ని జాతిఉద్యమాలు సమర్థనీయంకావు, అన్నీ వ్యతిరేకించ వలసినవికావు. ప్రతి జాతిఉద్యమానికి ఒక ప్రధానమైన వర్గస్వభావం ఉంటుంది. అదే ఆ జాతి ఉద్యమంపట్ల మార్క్సిస్టుల వైఖరిని నిర్దేశిస్తుంది. ఉదాహరణకు నాజీవాదం జర్మన్‌జాతీయతావాదం. అయినా దాని వర్గస్వభావం మొదట ఫాసిజం, క్రమంగా సామ్రాజ్యవాదం కావడంవలన, 1920 లలోని జర్మన్ ప్రజల దుర్భర జీవితపరిస్థితులకు సానుభూతిగల కమ్యూనిస్టులుగూడ నాజీ వాదాన్ని ఏరోజు సమర్థించలేదు. అలాగే తూర్పుబెంగాల్‌లో ముజబూర్ రెహ్మన్ నాయకత్వాన నడిచిన జాతిఉద్యమం యదార్థంగా సోవియట్ సోషల్ సామ్రాజ్య వాదానికి మాత్రమే సహకరిస్తుందన్న వాదనతో చైనా నాయకత్వం, మనదేశంలో చాలమంది విప్లవ కమ్యూనిస్టులు దానిని సమర్థించలేదు. (అయితే ఆ జాతి ఉద్యమం అని తరువాత జరిగిన పరిశోధనలవలన తెలుస్తోంది. అదే నిజమయితే, దానిని సమర్థించడమే సబబు, ఇది వేరేవిషయం). అదే పాలస్తీనా జాతీయతావాదం మౌలికంగా సామ్రాజ్యవాద వ్యతిరేకం గావటంచేత అది వ్యక్తిగత హింసావాదాన్ని చేపట్టినప్పటికీ, దాన్ని సమర్థించడం మార్క్సిస్టులవిధి.

ఈ విషయాలు 'సురా'కు తెలియకకాదు. తెలిసేతాను సాధించదలచుకున్న దానికి కావలసిన పునాది ముందుగానే వేసుకున్నాడు. వలస విధానానికి వ్యతిరేకమైన జాతిఉద్యమం ఎంత అమానుషత్వానికి లోనైనా మార్క్సిస్టులకు (ఒక్క-ట్రాట్స్కీవాదుల్ని మినహాయిస్తే) సమర్థనీయం కాబట్టి, ఈశాన్య భారతంలోని జాతులను ఆర్థికంగా దోచుకొని ఈశాన్యేతర భారతాన్ని అభివృద్ధిచేయడం భారత ప్రభుత్వ ఆర్థిక నీతిఅని, ఈ జాతులు నివసించే ప్రాంతాలు, అంటే అస్సాం, త్రిపుర, నాగాలాండ్ మొదలయిన రాష్ట్రాలు, వెనుకబడి ఉండటమే మిగతా భారతదేశం అభివృద్ధి చెందడానికి కారణమని, చూపించడం 'సురా' ఉద్దేశ్యం (పేజీ 74). అతని వాదానికి ఇది పునాది.

ఈ పునాదిలో మొదటిఅంశం ఈశాన్య భారత చరిత్రను, రాజకీయార్థికాలను పాక్షికంగా పాఠకునికి పరిచయం చేయడం. నిజానికి బెంగాలీల చరిత్రనర్థంచేసుకోకుండ ఈశాన్య భారతాన్ని అర్థంచేసుకోవడంఅసాధ్యం. ఈనాడు అస్సాంలోను త్రిపురలోను మేఘాలయలోను ఉద్యమాలలో కొద్దోగొప్పో బెంగాలీ వ్యతిరేకత ఉందంటే అది యాదృచ్ఛికంగాదు. ఆ జాతుల చరిత్రలు బెంగాలీల చరిత్రతో ముడిపడి ఉన్నాయి. ఒకరి చరిత్రచెప్పి ఇంకొకరి చరిత్ర చెప్పకపోవడం ఆ ఇంకొకరికి అన్యాయం చేయడం అవుతుంది. కాని, బెంగాలీలగురించి 'సురా' ఈ పుస్తకంలో చెప్పినవి రెండేవిషయాలు. ఒకటి బ్రిటిష్ ప్రభువులు 1826 లో ఈశాన్య భారతంలో ప్రవేశించిన తరువాత తమ పాలనా యంత్రాంగాన్ని నడపడానికి మధ్యతరగతి (భద్రలోక్) బెంగాలీలను తరలించుకు వెళ్ళినట్లు, ఈ బెంగాలీలే తరువాతి కాలంలో ఈశాన్య భారతంపై తమ ఆధిక్యతను నెలకొల్పి అక్కడి ప్రజలను సాంస్కృతికంగాను అన్యంగాను పీడించినట్లు. రెండవది, ఈశాన్య భారతంలో పరిశ్రమలు మొదలుపెట్టిన తరువాత ఏర్పడిన ఆహారకొరతను భర్తీచేయడానికి బ్రిటిష్‌వారు తూర్పు బెంగాల్‌నుండి ముస్లిం రైతాంగాన్ని తరలించుకు వెళ్ళినట్లు. అయితే, ఈవిధంగా బ్రిటిష్‌వారు రమ్మన్నచోటికల్లా చేయమన్న పనికల్లా బెంగాలీలు ఎందుకు వెళ్ళారన్న అనుమానం 'సురా'కు వచ్చినట్లులేదు. బహుశా, మనలో కొంతమంది దేశదిమ్మరితనం మలయాళీల రక్తంలో ఉందనుకునేటట్లు, వలసవెళ్ళడం బెంగాలీల జాతి లక్షణం అని 'సురా' భావమేమో!

అయితే వాస్తవం దీనికి విరుద్ధం. ఈనాటికీ అంతంగాని బెంగాలీలవలసకు కారణం వారి గత రెండువందల సంవత్సరాల భయంకరచరిత్ర. భారతదేశంలో

మరేజాతీ బ్రిటిష్‌వారిచేత బెంగాలీలంతగా పీడించబడలేదు. గత శతాబ్దంలో ముందెన్నడూలేనంతగా క్షామాలు కరువులు ఈ దేశంలో వాటిల్లడానికి సామ్రాజ్యవాద దోపిడీ కారణమైతే, ఆ దోపిడీ ఎక్కువకాలంగా, అతితీవ్రంగా సాగింది ఈనాటి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలలో. ఆసామ్రాజ్యవాద పీడన ఫలితంగానే ఈనాటికీ బంగ్లాదేశ్‌లో ఉన్నంత కటికదారిద్ర్యం మరే 'మూడవ ప్రపంచ' దేశంలోను లేదు, ఆ పీడన ఫలితంగానే 'సురా' కృతజ్ఞతలు తెలుపుకున్నవారిలో ఒకరైన గెయిల్ ఒమ్వెట్ అన్నట్లు మొదటినుంచీ ఈశాన్య భారతంమీద 'బెంగాలీలఆధిక్యత' ఉన్నప్పటికీ, ఈనాటికీ పశ్చిమబెంగాల్‌లో ఉన్నంతదారిద్ర్యం ఈశాన్య భారతంలో ఎక్కడాలేదు (దరిద్రరేఖ దిగువనఉన్న జనాభాశాతం అస్సాంకంటె ఎప్పుడూ పశ్చిమబెంగాల్‌లోనే ఎక్కువగా ఉంటూవస్తోంది). ఆ పీడనఫలితమే క్షామం, వలస. ఆ పీడన ఫలితమే అస్సాంలోని 'విజాతీయుల సమస్య' అయితే 'సురా' చెప్పని ఈ కథను కొంచెం వివరంగా తెలుసుకోవలసిన అవసరంఉంది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ దేశంలో తయారైన వస్త్రాలకు మార్కెట్ సంపాదించడంకోసం భారతదేశంలోని చేనేత పరిశ్రమను నాశనం చేసిన వైనం అందరికీ తెలిసినదే. అయితే ఇది అన్ని ప్రాంతాలలోకంటె బెంగాల్‌లో ఎక్కువగా సాగింది. ఢాకాలోని సన్నటి వస్త్రాల నేతగాళ్ళ చేతివేళ్ళు తెగగోయించినట్లు కూడ ఒక కథ ఉంది. ఇది ఎంత నిజమో తెలియదుగాని, నాశనం మాత్రం జరిగింది. ఈ వినాశకార్యానికి రెండు ఫలితాలున్నాయి. మొదటిది, ఉత్పత్తి సాధనాలను పోగొట్టుకొని, భూమిలేని రైతాంగంలో భాగమైన చేనేతకార్మికులు. రెండవది ఈ వస్త్రాల ఎగుమతి వ్యాపారం చేస్తూ ఉండిన వ్యాపారస్తులు చితికిపోయి మధ్యతరగతిలో చేరడం. దీనికి సమాంతరంగా పుట్టింది జమీందారీ వ్యవస్థ. ఈ వ్యవస్థ కూడ బెంగాల్‌లో మరెక్కడాలేని వింత స్వరూపాన్ని దాల్చింది. ఇక్కడ జమీందారుకూ రైతుకూ మధ్య ఛోటా జమీందార్లు (జోతేదార్లు) బయలుదేరారు- అంటే రైతు శ్రమను మెట్లుమెట్లుగా దోచుకునే భూస్వాముల సోపానం ఏర్పడిందన్నమాట. ఈ జోతేదార్ల పట్టణస్వరూపమే మధ్యతరగతి 'భద్రలోక్'. వీరు, చితికిన వస్త్రవిపణులు, బ్రిటిష్ వారి పాలనాయంత్రాంగంలో భాగంగా వలసవెళ్ళారు. ఈవర్గ వైరుధ్యానికి రెండవవైపున్నది. అతిగా దోచుకోబడ్డ రైతాంగం, వారితో పోటీగా నిలబడి వారి జీవితం మరింత దుర్భరం చేసిన ఒకప్పటి చేనేత పనివారు. వీరిసమూహం బెంగాల్ పల్లెపట్ల దారిద్ర్య నిలయం. దీనికి తోడు, ఈ జమీందార్లు, జోతేదార్లు రైతాంగం నుండి దోచిన తిండిగింజల బలవంతపు ఎగుమతి. దేశంలో క్షామం ఉన్న సంవత్సరా

లలో గూడ సామ్రాజ్యవాదులు దేశంనుండి తిండిగింజల ఎగుమతి చేస్తూనేవచ్చారు బిపిన్‌చంద్రరాసిన 'భారతదేశంలో ఆర్థిక జాతీయతత్వం ఉత్పన్నం, అభివృద్ధి' అన్నపుస్తకంలో ఈ విషయాలకు సంబంధించిన సమాచారాలు విపులంగా ఇవ్వబడ్డాయి). వీటన్నిటి ఫలితం గత శతాబ్దంలో దేశంలో పైశాచిక నృత్యం చేసిన క్షామం. ఈ క్షామం దక్షిణ, ఉత్తర భారతాలను తూర్పున బెంగాల్ ఒరిస్సా ప్రాంతాలను అతిగా పీడించింది. వీటన్నిటి ఫలితమే 'భూమికోసం, భుక్తికోసం' వలస. సురా 'అస్సాం టీ తాగడం అంటే వేధింపబడుతున్న అస్సామీ కూలీల రక్తం తాగడమే' నన్న 1886 లోని సంజీవనీ పత్రిక సంపాదకీయం కోట్ చేసాడు. అతను చెప్పనిదేమిటంటే ఈ కూలీలు అస్సామీలు కారని, కూటికోసం అన్ని వందల మైళ్ళు వలస వెళ్ళిన బిహారీలు, ఒరియాలు, బెంగాలీలునని. ఈ శతాబ్దంలో గూడ ఈ వలస సాగుతూనే వచ్చింది.

కథ అంతటితో ఆగలేదు. పాకిస్తాన్ ఏర్పడ్డ తరువాత పశ్చిమ పాకిస్తాన్ తూర్పు పాకిస్తాన్‌ను వలస విధానంలో దోచుకుంది. పాకిస్తాన్ ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితంగా తూర్పుబెంగాల్ రైతాంగంఆదాయంలో 24 నుండి 49 శాతం వరకు పశ్చిమ పంజాబు పెట్టుబడిదార్లు దోచుకున్నట్లుగా అంచనాలున్నాయి. ('ఎక్స్‌ప్లోజన్ ఇన్ ఎ సబ్‌కాంటినెంట్' అన్న పుస్తకంలో రిచర్డ్‌నేషన్స్ వ్యాసం) అంటే మళ్ళీ పేదరైతాంగం 'పొట్టచేతపట్టుకు' వలస పోవలసివచ్చింది. ఈ నాటికీ ఇది సాగుతోంది. ప్రతిఏటా వ్యవసాయ కూలీలు బంగ్లాదేశ్ నుండి అస్సాంకు ఇరుదేశాల సరిహద్దు దళాల కళ్ళుగప్పి కూలిపని కోసం వస్తూంటారు. ఇంత ప్రమాదకరమైన రాకపోకలు ఎంతో దారిద్ర్యం లేకపోతే జరగవు. అంతేగాని ముస్లింలీగ్ నాయకులో కాంగ్రెస్ నాయకులో వోట్లకోసం రప్పించుకున్నారనడం పూర్తిగా అశాస్త్రీయం.

ఈ విషయాలు సురా కు తెలియకకాదు. ఇవినేను పరిశోధనచేసి కనుగొన్నవి గావు. మరయితే ఎందుకుదాచినట్లు? అసలు 'బహిరాగతుల'ను అస్సాంనుండి తరిమివేస్తే నష్టపోయేది ఒకప్పుడు అస్సాంలో ఆధిక్యత కలిగిఉండిన బెంగాలీలుకాదని, రెండెకరాల భూమికోసం అస్సాంవచ్చి తమశ్రమతో వేల ఎకరాలను సాగులోకి తెచ్చిన రైతాంగమని ఎందుకు చెప్పలేదు? సురా కు బెంగాలీద్వేషం ఆపాదించలేం. మరయితే మార్క్సిజం బెంగాలీజాతీయదురహంకారవాదతత్వమనే అస్సామీయుల ఆరోపణకు భుజాలు తడుముకోవడమా? లేకపోతే 'రివిజనిస్టం'టారని భయమా?

సురా తన ప్రతిపాదనను సమర్థించడానికి వేసుకొన్న పునాదిలో రెండవ అంశం ఈశాన్యభారతాన్ని ఒక్క 'యూనిట్'గా పరిగణించడం. ఇది అతనికి

రెండు విధాలుగా అవసరం. మొదటిది, ఏ అతివాద జాతీయవాదులో, మతిచెడ్డ రివిజనిస్టులోతప్ప ప్రజాతంత్రవాదులందరూ నాగా, మిజో, త్రిపురిజాతుల పోరాటాన్ని సమర్థిస్తారు. (కనీసం సానుభూతితో చూస్తారు). ఈ సమర్థింపు, సానుభూతి, అస్సాం ఉద్యమానికికూడ సంక్రమింపజేయడం సురా ఉద్దేశ్యం. రెండవదేమంటే, మొదట్లోచెప్పినట్టు ఈశాన్యభారతాన్ని దోచుకొని ఈశాన్యేతర భారతాన్ని అభివృద్ధిచేసే వలసవిధానం భారతఆర్థికనీతి అన్నది సురా ప్రతిపాదన. అయితే అస్సాంరాష్ట్రాన్ని ప్రత్యేకంగా పరిగణిస్తే ఈ ప్రతిపాదనను నిరూపించడం కష్టం. కాబట్టి ఈశాన్య భారతాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి కొండప్రాంతం గిరిజనజాతుల విగతిని బ్రహ్మపుత్ర నదీలోయప్రాంతం అస్సామీలకు కొంచెంఅంటించి నిరూపణ చేయడం అవసరం. ఇది ఏవిధంగా సాధించాడన్నది చూద్దాం. నిజంగానే వలసవిధానం భారత దేశ ఆర్థికనీతి అయితే వలసప్రాంతాల జీవనప్రమాణం ఇతర ప్రాంతాలకంటే తక్కువగా ఉండాలి. అంతేకాకుండ ఉత్పత్తి, జీవనప్రమాణాల పెరుగుదలరేటు ఇతరప్రాంతాలకంటె తక్కువగాఉండాలి. దీనికి సంబంధించిన గణాంకాలు సురా 74వ పేజీలో ఇచ్చాడు. మొత్తం భారతదేశం తలసరిఆదాయం 1278 రూపాయలని, ఈశాన్యభారతంలో 824 రూపాయలని (ఏ సంవత్సరంలోనో, ఏ సంవత్సరం ధరల ప్రకారమో, చెప్పలేదు. 1980 81 లెక్కలింకా రాలేదుకాబట్టి, 1970-71వి కావచ్చు, లేదా తరువాతి అంచనాలు కావచ్చు) మొత్తం భారతదేశంలో తలసరి ఆదాయం 315 శాతం, ఉత్పత్తి 4 శాతంపెరగగా, ఈశాన్యభారతంలో 260 శాతం, 2 శాతంమాత్రమే పెరిగాయని అంటున్నాడు. (ఈ పెరుగుదలగూడ ఏ సంవత్సరంనుండి ఏ సంవత్సరానికో చెప్పలేదు. అక్కడ ఇచ్చిన రెఫరెన్సును బట్టిచూస్తే, 1960-61 నుండి 1970-71కి అయిఉండాలి. అయితే 200 శాతం, 300 శాతం వాస్తవికఆదాయం ఎప్పుడూ పెరగలేదుకాబట్టి ఇది డబ్బు ఆదాయం అయిఉండాలి. ఇంత అపసవ్యపు పరిశోధనను 'శాస్త్రీయదృక్పథం' అని గర్వంగాచెప్పుకుతిరగడం ఎందుకు?

అయితే ఈశాన్య భారతం నుండి అస్సాంను విడదీసి, 1960-61, 1970-71 లెక్కల నాధారంగా పరిశీలిస్తే కనిపించేది ఇందుకు విభిన్నమైన వాస్తవం. (ఈ దిగువ ప్రస్తావించిన గణాంకాలన్నీ బకుల్ ధోలాకియా, రవీంద్ర ధోలాకియా, 20 సెప్టెంబర్ 1980 ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వ్యాసం నుంచి తీసుకొన్నవి).

1960-61 లో (అదే సంవత్సరం ధరల ప్రకారం) భారతదేశం తలసరి ఆదాయం 307 రూపాయలు; అస్సాం తలసరి ఆదాయం 349 రూపాయలు 1970-71లో

(1960-61 ధరల ప్రకారం) దేశతలసరి ఆదాయం 340 రూపాయలు, అస్సాం సరితల ఆదాయం 358 రూపాయలు, 1947 మొదలుకొని అస్సాంనుదోచి ఈశాన్యేతర భారతాన్ని అభివృద్ధిచేయడమే భారత ఆర్థికనీతి అయితే 1960లోను, 1970 లోనుగూడ అస్సాం తలసరిఆదాయం దేశ తలసరి ఆదాయంకంటె ఎక్కువ ఎందుకుంది? అయితే ఈ పది సంవత్సరాలలో దేశ తలసరిఆదాయం సుమారు 10 శాతం పెరుగగా అస్సాంలో 2 శాతంమాత్రమే పెరిగినమాట వాస్తవం. కాని దేశతలసరిఆదాయం పెరుగుదలకుకారణం అస్సాందోపిడికాదు, విదేశీఅప్పులతో సాధించిన 'ఆకుపచ్చ విప్లవం' (green revolution) ఈ 10 సంవత్సరాలలో పంజాబు తలసరిఆదాయం 374 రూపాయలనుంచి 499 రూపాయలకు, హర్యానా తలసరిఆదాయం 360 రూపాయల నుండి 497 రూపాయలకు పెరిగాయి. దేశతలసరిఆదాయం పెరుగుదలకు కారణం ఇది. అయితే ఈపెరుగుదల సాధించింది ఈనాటికీతీరని విదేశీఅప్పులతో (1966 నుండి 1973 లోపల భారతప్రభుత్వం 10 వేలకోట్ల రూపాయలు అప్పుచేసింది. ఈ విషయం తరిమెల నాగిరెడ్డి పుస్తకం 'తాకట్టులో భారతదేశం'లో చెప్పబడింది).

జీవనప్రమాణం సంగతి ఇలావుంటే, ఉత్పత్తి పెరుగుదలరేటు తీసుకుందాం. 1960-61 నుండి 1970-71 ల మధ్య భారతదేశపు సగటు ఉత్పత్తి పెరుగుదలరేటు ('చక్రవడ్డీ' రేటు) 3.24; అస్సాం ఉత్పత్తి పెరుగుదలరేటు 3.27- అంటే దేశంలో పెరుగుదలరేటు కంటె ఎక్కువే. మరి (ఏసంవత్సరాల మధ్యనో చెప్పకుండ) దేశంలో 4 శాతం, ఈశాన్యభారతంలో 2 శాతం అనటంలో గల ఉద్దేశ్యం ఏమిటి? కొండప్రాంతం గిరిజనుల వెనుకబాటుతనాన్ని అస్సాంకు కూడా అంటగట్టి అస్సాం ఉద్యమాన్ని వలసదోపిడీ వ్యతిరేక ఉద్యమంగా చిత్రించడమేగా?

అలాగే సాగుబడిలోవున్న భూమిలో నీటిపారుదల సౌకర్యాలున్నప్రాంతం దేశంలో 22 శాతం అయితే ఈశాన్యభారతంలో 18 శాతం మాత్రమేనని సురా చెబుతున్నాడు (పేజీ 83). అయితే 5 వ పంచవర్షప్రణాళిక ముసాయిదాలో బ్రహ్మపుత్ర లోయప్రాంతం (అంటే ఒకటి రెండు జిల్లాలను మినహాయిస్తే అస్సాంరాష్ట్రం)లో నీటి పారుదలవసతి మొత్తం దేశంలో లాగే 22 శాతం ఉందని, కొండప్రాంతంలో 10 శాతం మాత్రమే ఉందని చెప్పబడివుంది. ఈ రెండు సంఖ్యలను జాగ్రత్తగా కలగలిపితే వచ్చిందే సురా చెప్పిన 18 శాతం ఈ కలగలుపుడు ఎందుకు చేసినట్లు?

అలాగే ఇంకా నిరుద్యోగానికి మొదలయిన విషయాలకు సంబంధించి ఈశాన్య భారతాన్ని తదితర ప్రాంతాలను సురా పోల్చాడు. ఈ అంశాలలో అస్సాంకుసంబం

దించినసమాచారం సేకరించలేకపోవడంమూలాన వాటిని ప్రస్తావించడంలేదు. అయితే సురా చేసిన 'పరిచయం' స్వరూపం తెలుసుకోవడానికి ఈమాత్రంచాలనుకుంటాను.

ఈదేశఆర్థికవిధానం అస్సాంనుదోచుకొని మిగిలినప్రాంతాలను అభివృద్ధిచేసే వలసవిధానం అనేప్రతిపాదనకు సురా ఇచ్చిన మిగతాసాక్ష్యాలను పరిశీలించేముందు ఒక్కవిషయం చెప్పాలి. చాలమందిలో అస్సాం అన్నిప్రాంతాలలోకీ వెనుకబడ్డదని, అన్నివనరులుండీ అంతతక్కువ ఆదాయంగల ప్రాంతాలులేవనీ ఒకభావనఉంది. ఇదేమంతనిజంకాదు. అస్సాం వెనుకబడ్డప్రాంతమే- పంజాబుకంటె, హర్యానాకంటె పశ్చిమమహారాష్ట్రకంటే, దక్షిణ (పశ్చిమ)బెంగాల్‌కంటె, కోస్తాఆంధ్రకంటె, దక్షిణ కర్ణాటక కంటె అస్సాం వెనుకబడ్డప్రాంతమే. అయితే అస్సాంతోసమానంగా వనరుల్ని కల్గిఉన్న బీహార్, ఒరిస్సా మధ్యప్రదేశ్‌ల కంటెకాదు; నిరుడుక్షామంలో వందల మందిని ఆకలిదప్పులకు బలిపెట్టుకున్న ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌కంటెకాదు, విదర్భకంటే. మరాఠ్వాడకంటె, తెలంగాణ రాయలసీమలకంటె. ఉత్తరకర్ణాటక (గుల్బర్గ, బీదర్‌ప్రాంతం) కంటె, దక్షిణతమిళనాడుకంటెకాదు. అస్సాంలో 77 శాతం వెనుకబడ్డప్రాంతమయితే, మధ్యప్రదేశ్‌లోని 45 జిల్లాలలో 36 (అంటే 80 శాతం) వెనుకబడ్డవి. అసమానతలకు పుట్టినిల్లయిన భారతదేశంలో దేశపు సగటుఅభివృద్ధిని అస్సాం అభివృద్ధితోపోల్చడం ఎందుకు? ఒక్కపంజాబు నాలుగడుగులుముందుకేస్తే దేశమంతా కలిసికట్టుగా అస్సాంనుదోచి ప్రగతిసంపాదించిందని చూపడానికేగా? అస్సాంతోసమానంగా వనరులు బీహార్‌లోవున్నాయి. అయితే 1960-61లో అస్సాం తలసరిఆదాయం 349 రూపాయలయితే బీహార్ తలసరిఆదాయం 228 రూపాయలు; 1970-71లో అస్సాంలో 358 రూపాయలయితే బీహార్‌లో 223 రూపాయలు (1960-61 నుండి 1970-71 వరకు తలసరిఆదాయం తగ్గిపోయినరాష్ట్రం బీహార్ ఒక్కటే). అలాగే పారిశ్రామిక వనరులకు అటవీసంపదకు ఏప్రాంతానికీతీసిపోని ఒరిస్సా తలసరి ఆదాయం 1960-61లో 225 రూపాయలు 1970-71లో 269 రూపాయలు (మధ్య ప్రదేశ్‌లో 261, 262 రూపాయలు, కేరళలో 280, 299 రూపాయలు). అస్సాంలో గ్రామీణదారిద్ర్యం 48 శాతంఅని సురా చెబుతున్నాడు. ఈమధ్యవేసిన అంచనా ప్రకారం ఒరిస్సాలో గ్రామీణదారిద్ర్యం 70 శాతం పైనఉంది )యాదృచ్ఛికంగా ఒక దినపత్రికలోచూసిన రిపోర్ట్అవటాన దీనికిసరైన రిఫరెన్స్ ఇవ్వలేనందుకు క్షమించాలి) 1960-61లో ఆంధ్ర, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు అస్సాంకంటె తక్కువ తలసరిఆదాయం కలిగిఉన్నాయి. 1970-71 లోను అదేపరిస్థితి. ఎవరు ఎవరినిదోచుకుంటున్నారు? అస్సాంనుదోచుకొని మిగిలిన

పాంతాలు అభివృద్ధి చెందిపోతున్నాయా ? లేకపోతే బీహార్ ఒరిస్సారాష్ట్రాల సంప
దను దోచుకొని మిగిలినదేశం (అస్సాంతోసహా) అభివృద్ధి అయిపోతోందా ? లేకపోతే
పంజాబు హర్యానారాష్ట్రాలు, మురికిసందుల బొంబాయినగరం కుళ్ళిపోయిందని
చెప్పుకోబడుతున్న కలకత్తానగరం మిగిలినపాంతాలను దోచిపెట్టి అభివృద్ధిచెంది
పోతున్నాయా ! అసలు ఈదేశంలో ప్రాంతీయదోపిడీమీద ఆధారపడ్డ వలసవిధానం
ఉందా ? ఈదేశంలో అంతర్గతవలసలు (colonial hinterlands) ఉన్నాయా ?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాలంటే పైపై పరిశీలనలు పనికిరావు.
నాలుగు గణాంకాలుగుప్పిస్తే చాలదు. అస్సాంలో చాలవనరులున్నా భారతదేశపాలక
వర్గం వలసదోపిడీ విధానంలో తనకు అత్యవసరంగా కావలసిన ముడిసరుకుల్ని తప్ప
మరిదేనినీ అభివృద్ధిచేయలేదని సురా అంటున్నాడు. వలసవిధానంలో ఇది జరిగేమాట
నిజమేగాని ఇలా జరిగినంతమాత్రాన అది వలస విధానంకాదు. ఈ విధంగా ఆలో
చించడం దళారీ బూర్జువా వర్గం స్వభావాన్ని అర్థంచేసుకోకపోవడమే. ప్రగతిశీలం
గల బూర్జువా వర్గం దేశంలోని అన్ని వనరుల్ని ఉపయోగించి ప్రజల అవసరాలను
(తనకు లాభదాయకంగా ఉన్నమేరకు) తీర్చి తాను లాభాలు చేసుకుంటుంది. దళారీ
బూర్జువవర్గం తద్విభిన్నంగా ఏరోజుకారోజు దొరికినంతమేరకు తానుతిని తనకు
సాంకేతిక ఆర్థిక వాణిజ్య 'సహాయం'చేసే సామ్రాజ్యవాదులకు పెడుతుంది. 'భారత
దేశం పెట్టుబడిదార్లకు ఉత్పత్తిసాధనాల అభివృద్ధి కంటె దైనందిన లాభాలే ముఖ్యమై
పోయా'యన్నది కమ్యూనిస్టుల ఆరోపణేకాదు, అది అందరూ అంటున్న విషయమే.
ఇదే దళారీబూర్జువా వర్గం స్వభావం. ఈ రకమైన వక్రాభివృద్ధి ఒక అస్సాంలోనేకాదు,
దేశమంతటా జరుగుతోంది. ప్రభుత్వం ప్రకటించే పుస్తకాలలో వర్ణించబడ్డ వనరుల
సంపదను వాటి వాడకంతో పోల్చితే, ఈదేశాన్ని పాలిస్తోంది మనుషులా లేక జీవంలేని
శవాలా అన్న అనుమానం ఎవరికైనా కలుగుతుంది. అటువంటిదేదో లేకపోతే
అస్సాంకంటె ఎక్కువ వనరులసంపదగల బీహార్ తలసరి ఆదాయం అస్సాం తలసరి
ఆదాయంలో 60 శాతం మాత్రం ఉండడం, తలసరి ఆదాయాన్నే (వర్గవిభేదాల మాట
మరచిపోయి) ప్రమాణంగాతీసుకున్నా దేశంలో ఈ ఒక్క సంపన్న రాష్ట్రమే రోజు
రోజుకూ పేదదవుతూండడం వివరించడం వీలుపడదు. అసలు 'మమ్మల్నిదోచుకొని
మీరంతా బలుస్తున్నారు' అనేహక్కు ఎవరికైనావుంటే అది బీహారీలకేగాని, అస్సామీ
లకు లేదు. అయితే ఆ ఆరోపణగూడ నిజంకాదు. ఈ దేశంలో అంతర్గతవలసలు
లేవు, అంతర్గతవలస విధానం లేదు. ఇక్కడున్నది ఒక దళారీ గుత్త పెట్టుబడిదారు
వర్గపాలన. ఈ వర్గం వనరులున్నచోట వనరుల్ని లేనిచోట ప్రజల శ్రమనుదోచి తాన

తిని, కొంత సామ్రాజ్యవాదులకు పెడుతోంది. ఈరకం దోపిడీలో ఎగుడుదిగుళ్ళుంటాయి. ఉత్పాదకశక్తిని ఎంతో అభివృద్ధిచేసిన ప్రగతిశీలం గల బూర్జువా వర్గపాలనలోనే పాశ్చాత్యదేశాలలో ఎగుడుదిగుళ్ళున్నాయి. ఇంక దళారీవర్గం పాలన సంగతి చెప్పాలా? అయితే ఈ ఎగుడుదిగుళ్ళను సరిచేయడంకోసంకాదు నేడు పోరాటం చేయవలసింది. ఈపాలనను అంతం చేయడంకోసం.

మరయితే ఈశాన్యభారత ఉద్యమాల స్వరూపం ఏమిటి? వాటిపట్ల విప్లవ కమ్యూనిస్టులవైఖరి ఏవిధంగా ఉండాలి? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే మొదట చెప్పిన విషయం గుర్తుంచుకోవాలి. మార్క్సిస్టు దృక్పథంలో జాతిఉద్యమాలకు విశిష్టమైన స్థానంలేదు. జాతిఉద్యమంపట్ల వైఖరి దాని వర్గస్వభావాన్నిబట్టి మారుతుంది.

ఈశాన్య భారతంలోని కొండప్రాంతాలు బ్రహ్మపుత్రనదీలోయ ప్రాంతం 'ఆర్థిక రాజకీయ సాంఘిక సాంస్కృతిక' రంగాలలో విభిన్నంగా ఉన్నాయని, వాటిని ఒక్కగాటనకట్టివేయడం అసాధ్యమని 'సురా' అంటున్నాడు (మరయితే అస్సాంను గిరిజనప్రాంతాలను కలిపి 'ఈశాన్యభారతం' అని పేరుపెట్టి గణాంకాలు సేకరించడం ఎందుకు?). అంతేకాదు ఈనాటి ఉద్యమాల వర్గస్వభావం కూడ విభిన్నం. ఈనాటి ఈశాన్యభారతాన్ని గురించి ముఖ్యంగా చెప్పవలసిన విషయం ఇది. సురా ఉద్దేశ్యం ఏమయినా, ఈ విషయాన్ని కప్పిపుచ్చడం ఈ పుస్తకం ముఖ్యంగా సాధించింది.

భారతదేశంలో ఎక్కడా అంతర్గత వలసదోపిడీలేదని చెప్పడం జరిగింది. ఇది అస్సాంకేకాదు, నాగాలాండ్ మిజోరంలకు గూడ వర్తిస్తుంది. అసలు ఒక ప్రాంతాన్ని వలసవిధానంలో ఆర్థికంగా దోచుకుంటే దానిఫలితంగా దోచుకున్న ప్రాంతాలన్నీ, ఆ ప్రాంతాలలోని వర్గాలన్నీ (వాటిమధ్య ఎన్ని అసమానతలున్నా) మొత్తంగా అభివృద్ధి చెందాలి. పాశ్చాత్యదేశాలు ఈనాటి 'మూడవ ప్రపంచం'లో వలసదోపిడీ మొదలుపెట్టిన కొద్దిసంవత్సరాలకే అన్నివర్గాలు (కార్మికవర్గంతోసహా), అన్ని ప్రాంతాలు, అభివృద్ధిచెందాయి. బ్రిటన్‌లో చార్టిస్టు ఉద్యమం తరువాత, ఫ్రాన్సులో ప్యారిస్ కమ్యూన్ తరువాత కార్మికవర్గ ఉద్యమాలు మందగించడానికి ఇదే కారణం. కాని, పేదవాని బట్టలో చిరుగులలాగ దేశమంతటా వెనుకబాటుతనం వ్యాపించిన భారత భూమిలో అటువంటిదేమీకనుపించదు.

అయితే ఆర్థికేతర వలసపాలనఉంటుంది. ఇది బ్రిటిష్‌వారు ఈశాన్యభారతంలోను బెలూచిస్తాన్ ప్రాంతంలోను పాటించినది. దీనిస్వభావం ఆ ప్రాంతాలను

సరిహద్దుభద్రతకు గోడలాగాగణించడం. ఈశాన్యభారతంలోని గిరిజనరాష్ట్రాలను భారతప్రభుత్వం ఈరకమైన వలసభావంతోచూసింది. ప్రజలక్షేమంతో నిమిత్తంలేని ప్రభుత్వానికి ఇదిసహజధోరణిఅని ఈశాన్యభారతంపటం చూస్తేనేతెలుస్తుంది. అక్కడ ఎంతోకాలంగా సాగుతున్నఉద్యమాలు దీనికినిరసనగా మొదలయిన జాతిఉద్యమాలు. ఈవిషయం వాటిరూపంచూస్తేనే తెలుస్తుంది. నాగాలు మిజోలు భారతప్రభుత్వాన్ని సైన్యాన్ని తమశత్రువుగా ఎంచుకున్నారు. సాయుధుడైన శత్రువును సాయుధంగానే ఎదుర్కొంటున్నారు. ఈ పోరాటాల్ని అస్సాంఉద్యమంతోపోలిస్తేనే ఆ ఉద్యమాల విభిన్నవర్గస్వభావం అర్థమవుతుంది. ఈ సందర్భంలో 'ఉద్యమాలునడిపేవారి స్వభావాన్ని ప్రమాణంగా తీసుకోగూడదు. ఉద్యమంయొక్క అసలుస్వరూపంచూడాలి, అన్నవాదంఉంది. అసలుస్వరూపంగూడచూద్దాం, కాని ఈవాదం బొత్తిగాఅశాస్త్రీయం. ఉద్యమం తనవర్గస్వరూపాన్నిబట్టి పోరాటపంథాను, కోర్కెలని నినాదాలను ఎంచుకుంటుంది. నాయకత్వం నిమిత్తమాత్రం. అస్సాంఉద్యమంనడిపేవారిలాగే 'ప్రీపాక్' పి,ఎల్.ఏల నాయకత్వం విద్యార్థుల, విద్యాధికులచేతిలోవుంది. త్రిపురలోజరుగుతున్న గిరిజనపోరాటాన్ని నడుపుతున్న త్రిపుర ఉపజాతి యువసమితి T.U.J.S. కూడ 'మధ్యతరగతి' యువకుల నాయకత్వంగలసంస్థే. అయినా ఈపోరాటం గిరిజనుల భూములుకాజేసిన బెంగాలీభూస్వాములకు, వారిని విపరీతంగాపీడిస్తున్న బెంగాలీ వర్తకులకు వ్యతిరేకంగా సాగుతున్న గిరిజన శ్రామికవర్గపోరాటం కావటంచేత దాని రూపంగూడ అఖిలఅస్సాం విద్యార్థిసంఘం నడుపుతున్న అస్సాంఉద్యమానికిభిన్నంగా వుంది. (అంతదాకాఎందుకు, ఈనాటి ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల రైతాంగపోరాటానికి 'వాన్‌గార్డ్'గా నిలబడ్డది విద్యార్థులే).

సాంస్కృతికంగా అస్సాం సాధారణ (mainstream) భారతదేశ హిందూ-ముస్లిం సమాజంలోభాగం. ఈశాన్యేతర భారతదేశీయులు, కేంద్రప్రభుత్వంగూడ ఈశాన్యభారతంపట్ల దీనికనుగుణంగానే ప్రవర్తించారు. మొదటినుండిగూడ ఈశాన్య భారతంలో కల్లోలితప్రాంతచట్టంఉన్నా, మొదటినుంచిగూడ ఆ ప్రాంతమంతా ఉద్యమాలు నడుస్తూనేఉన్నా, నాగాలాండ్‌లో మిజోరంలో 1950లలోనే కల్లోలిత ప్రాంతాల ప్రకటన చేయబడగా అస్సాంలో ఈ సంవత్సరంవరకు ఎప్పుడూచేయలేదు. నాగాలను మిజోలను జంతువులనువేటాడినట్లు వేటాడినప్పుడు నోరుమెదపని పత్రికలు మేధావులు (వీరిలో అస్సామీలుగూడ ఉన్నారు) అస్సాంలో కల్లోలితప్రాంత ప్రకటనకు వ్యతిరేకంగా గగ్గోలుపెట్టారు. కేంద్రప్రభుత్వంగూడ ఆ ప్రకటనను ఎత్తివేసింది (అదే త్రిపురలో ఆ ప్రకటన ఎత్తివేయబడలేదు సరికదా అక్కడి సి.పి ఎం.

ప్రభుత్వం కొత్తకొత్త ఆర్డినెన్సులు జారీచేస్తోంది). చాలకాలంగా బెంగాలీ సాంస్కృతిక పీడనం అనుభవించిన అస్సామీలు 'తమదాకవచ్చినప్పుడు' గిరిజనులను పీడించక మానలేదు. 1961లో అప్పటి సంయుక్త అస్సాంరాష్ట్రంలో అస్సామీభాషను రాష్ట్రభాషగా ప్రకటించడానికి ప్రయత్నంచేసారు. దీనికి అస్సాంఉద్యమ మార్క్సిస్టు మేధావి సంజీబ్ కుమార్ బరువా అస్సామీలు తరతరాలుగా సాగిస్తోన్న అస్తిత్వాన్వేషణ (search for identity) లో భాగంగా చిత్రించయత్నించాడు. అయితే బెంగాలీలలో జాతీయ దురహంకారమయినది అస్సామీలలో మరొకటికావడానికి వీలులేదు.

అస్సాం సమాజ నిర్మాణక్రమంగూడ మిగిలిన దేశానికి విభిన్నంకాదు. పల్లెపట్ల భూస్వామ్యవర్గం ఉంది, పట్టణాలలో పెట్టుబడిదారీ వర్గం వుంది (సురా ఇచ్చిన లెక్కలప్రకారం, అస్సాం తేయాకు పరిశ్రమ యజమాన్లలో పాశ్చాత్యుల్ని మినహాయిస్తే మిగిలినవారిలో సగంపైగా అస్సామీలే); అయితే అస్సాంలోని పరిశ్రమల యజమాన్లలో అస్సామీలు తక్కువని, ఎక్కువగా 'విజాతీయు'లని సురా అంటున్నాడు, భారతదేశ బడాబూర్జువా వర్గాన్ని ఒక ప్రాంతానికి 'విజాతీయు'లనడం అశాస్త్రీయం అన్న విషయం అటుంచి, అంతవరకు 'విజాతీయు'లన్న పదాన్ని బెంగాలీల వలస సందర్భంలో వాడుతూవచ్చిన రచయిత, పాఠకుడు పొరబడకుండ, ఈ 'విజాతీయులు' బెంగాలీలుకారని, మార్వాడీలు గుజరాతీలని చెప్పవలసింది. ప్రస్తుత ఉద్యమం వారికి వ్యతిరేకంకాదని గూడ చెప్పవలసింది. ఎందుకు చెప్పనట్టు? 'వలసదోపిడీ'ని వ్యతిరేకించే ఉద్యమం అయితే ప్రధానంగా వీరినా ఎదిరించేది, లేకపోతే రైతాంగాన్నా? నాగా, మిజో, త్రిపురి జాతుల ప్రజలు తమ శత్రువును స్పష్టంగా గుర్తించారు, పోరాటం చేస్తున్నారు. ఒక్క అస్సామీలే తమమీది 'వలస విధాన దోపిడీకి'కి కారణం ఎవరో తెలుసుకోలేకపోవడానికి కారణమేమిటి? వారికంత దృష్టిమాంద్యమా? లేకపోతే ఈ 'వలస విధాన దోపిడీ' అన్న సిద్ధాంతం ప్రతిపాదించిన మేధావులకు దృష్టిమాంద్యమా? త్రిపురలో గిరిజనులు తమ భూములుకాజేసి బెంగాలీ భాషను తమ మీదకు రుద్దడానికి ప్రయత్నంచేస్తున్న బెంగాలీ భూస్వామ్య - వర్తక వర్గానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తే, అస్సాంలో 'ఆసు', అస్సామీభాషను తమ భాషగా అంగీకరించి అస్సాం సమాజంలో కలిసిపోవడానికి ప్రయత్నంచేస్తున్న 'బహిరాగతుల'ను బయటకుగెంటడానికి ప్రయత్నించడం గమనించదగ్గ విషయమని సురా తానే అంటున్నాడు. అయితే ఇందులో అసలు గమనించవలసిన విషయం– ఈ రెండు ఉద్యమాల విభిన్న వర్గస్వరూపం– సురా గమనంలోకి రాలేదు.

అస్సాంలో ఒకప్పుడు బెంగాలీల సాంస్కృతిక పీడన ఉన్నమాట నిజమే. అయితే అది పాతకథ. ముఖ్యంగా 1961 లో అస్సామీభాషను రాష్ట్ర భాషగా ప్రకటించిన తరువాత 'విజాతి సాంస్కృతిక పీడన' ఎక్కడి నుండి వచ్చిందో అర్థంకావడం లేదు. ఈనాడు అస్సాంలో 60 శాతం అస్సామీభాషను తమ మాతృభాషగా అంగీకరించిన వారున్నారు (సురా 99 వ పేజీలో 'విజాతీయు'లపేర ఇచ్చిన లిస్టులో చాలమంది ఈ కోవ వాళ్ళున్నారు). 11 శాతం స్థానిక మైదానప్రాంత గిరిజనులున్నారు. మిగిలిన 29 శాతం మాత్రమే బెంగాలీ, హిందీ, ఈశాన్యప్రాంత గిరిజన భాషలు మాట్లాడే వాళ్ళు. అస్సాంలో అస్సామీభాష మాట్లాడేవారు 'మైనారిటీ' అయిపోవడం ఏమిటి?

అస్సాం బూర్జువావర్గంచిన్నదే. కాని ప్రభుత్వ పెట్టుబడి bureaucratic capital మీద ఆధారపడిపెరగడం అలవర్చుకున్న ఈదేశపు బూర్జువావర్గాలకు పెరగడం ఎంతో కాలంపట్టదు. ఈ అస్సామీ బూర్జువావర్గం తమరాష్ట్రంలోని వనరులపై ఆధిక్యతను సంపాదించి భారత బడాబూర్జువావర్గాన్ని నిరసిస్తోంది. స్థానిక వనరులపై తన అధికారం పెంచజూస్తోంది. దీనిలోభాగంగా దేశబడాబూర్జువావర్గాన్ని 'విజాతీయ పెట్టుబడిదారువర్గం'గా చిత్రిస్తోంది. ఈ చిత్రీకరణకు సంజీబ్‌కుమార్ బరువా, తిలోత్తమమిశ్ర వంటి అస్సామీమార్క్సిస్టు మేధావులు, 'సురా' వంటి 'విజాతి' మార్క్సిస్టు మేధావులు సాయంచేస్తున్నారు. కాని ఈ మార్క్సిస్టు మేధావులకు ఈనాటి భారత సమాజస్వరూపం అర్థమయినట్లులేదు. నేటి భారత బడాబూర్జువావర్గం ఒక అఖిలభారతీయవర్గం. దానికి ఉపజాతీయతలేదు. కావడానికి అది గుజరాతీ, మార్వాడీ, పార్సీ, జైన్, చెట్టియార్లకలయిక అయినా అది ఈరోజు ఏజాతికీచెందనివర్గం. అలా కాకపోతే, బిర్లాలు 'మార్వాడీ'లే అయితే రాజస్థాన్ (మార్వాడీలదేశం) ఈనాడు వెనుకబడ్డప్రాంతాల జాబితాలో ఉండేదికాదు. పారిశ్రామికంగా అత్యంతఅభివృద్ధి చెందినదనిచెప్పబడే మహారాష్ట్రలోని ముఖ్యపరిశ్రమలన్నీ గుజరాతీల చేతులలో ఉన్నాయి, మహారాష్ట్రుల చేతులలోకాదు (ఎ. ఆర్. కామత్, ఎకనామిక్ అండ్ పొలిటికల్‌వీక్లీ సెప్టెంబర్ 27, అక్టోబర్ 4, 1980). మరయితే మహారాష్ట్రలో 'విజాతీయ ఆర్థికపీడన'ఉందని, 'వలసవిధానంలోదోపిడీ' జరుగుతోందనీ అందామా? శివసేనకు ఎర్రరంగుపులిమి విప్లవసేనగామార్చి నెత్తినెక్కించుకు ఊరేగుదామా? తెలంగాణాప్రాంతంలోకూడ ఆర్థికరంగంలో మార్వాడీ గుజరాతీలదిపైచేయి మరయితే చెన్నారెడ్డి మల్లికార్జున్‌లునడిపిన 'ప్రత్యేకతెలంగాణా' ఉద్యమం 'విజాతీయవలస దోపిడీ'కి వ్యతిరేక జాతిఉద్యమమా? సమర్థనీయమా? అవునంటే 'సురా' ఢిల్లీవదలి

హైదరాబాద్ తరలిరావచ్చు. చెన్నారెడ్డి పదవీచ్యుతుడైన తరువాత ఆ పెద్దమనిషిని 'ఇప్పటికైనా కళ్ళుతెరవమ'ని 'ప్రత్యేకతెలంగాణ చెయ్యమ'ని ఆదేశిస్తూ కొంతమంది ఇక్కడ గోడలమీదరాస్తున్నారు. వీరికి సురా తనమేధస్సును అరువీయవచ్చు.

భారతదేశ బూర్జువా వర్గాన్ని గుజరాతీ మార్వాడీ పంజాబీ ఉపవర్గాలుగా (మార్క్స్పరిభాషలో 'fractions') విడదీయడం వాస్తవికతకు విరుద్ధం. సరైన విభజన, ఒక బడాబూర్జువా వర్గం, ఒక్కొక్క ప్రాంతానికి చెందిన ఒక్కొక్క ప్రాంతీయ బూర్జువావర్గం. బడాబూర్జువావర్గంలో బిర్లాలవంటి మార్వాడీలున్నారు, టాటాలవంటి పార్సీలున్నారు. కిర్లోస్కర్ లవంటి మహారాష్ట్రులున్నారు. అయితే వీరు తమజాతుల ప్రతినిధులుకారు. ఇది ఒక అఖిలభారతవర్గం. అలాగే ప్రాంతీయ ఛోటా బూర్జువావర్గాలంటే ఉపజాతీయవర్గాలుకావు. ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ బూర్జువా వర్గంలో తెలంగాణప్రాంతంలోని కలపవ్యాపారంలోఉన్న గుజరాతీలుకూడ ఒకభాగం. ఒకపెట్టుబడిదారు ఏ ప్రాంతంవాడన్నది అతని మాతృభాషనుబట్టి నిర్ణయించడం భౌతికవాదానికి విరుద్ధం. అతని వ్యాపారదృష్టినిబట్టి నిర్ణయించాలి.

ఇంత ఉపోద్ఘాతం అయిన తరువాత అస్సాం ఉద్యమం గురించి చూద్దాం. అస్సాం వెనుకబడ్డప్రాంతం అన్నది ఇక్కడ ముఖ్యవిషయంగాదు. అస్సాం సమృద్ధిగా వనరుల్ని కలిగిఉందన్నది చాల ముఖ్యవిషయం. ఈ వనరులమీద భారత బడా బూర్జువావర్గం ఆధిపత్యాన్ని అస్సాంప్రాంతీయ బూర్జువా వర్గం (ఇందులో అస్సామీలే కాదు, మార్వాడీలు కూడ ఉన్నారు) నిరసిస్తోంది, ఎదిరించదలచుకుంది. అయితే మనదేశం బూర్జువా వర్గం గట్టిగా పోరాటం చేయడానికి ఇష్టపడదు (ఒక్క ప్రజలతో తప్ప). గతంలో సామ్రాజ్యవాదులతోను చేయలేదు, తరువాత భూస్వాములతోను చేయలేదు. అందుకే అస్సాం ప్రాంతీయ బూర్జువా వర్గం బడాబూర్జువాలను పూర్తిగా ఎదిరించే స్వాతంత్ర్యం కోరడం లేదు. సి. పి. ఎం. వారి 'వేర్పాటు' ఆరోపణ అసత్యమని అస్సాంఉద్యమకారులు ఘోషపెడుతున్నారు. ఈఘోష అబద్ధపుఘోష కాదు. పచ్చినిజం. అంతటితెగింపు ఈదేశ పాలకవర్గాలకులేదు. తమది సాయుధ పోరాటంకాదని, తాము అహింసావాదులమని గాంధేయులమనికూడ ఘోషపెడుతున్నారు. ఏనాడో ఆలోచించడంమానేసిన సి.పి.ఎం. మేధావులు ఈమాటల్ని నమ్మకపోవచ్చు గాని, ఇదికూడపచ్చినిజం. ఎంతపచ్చినిజంఅంటే గాంధీనడిపిన 'స్వాతంత్ర్యపోరాటం' నిజస్వభావం తెలిసినవారికి, అస్సాంఉద్యమం స్వరూపంగురించి మరేమీ చెప్పనక్కర లేదు. అస్సాం బూర్జువావర్గానికి కావలసించి తమప్రాంతపువనరులమీద తమఅధికారం పెరగడం. అస్సాంలోపండించే తేయాకుమీద అమ్మకంపన్ను తమకేదక్కాలని, అక్కడి బావులలోని నూనెమీద 'రాయల్టీ' పెరగాలని అస్సాం జనపనార తమమిల్లులకే దక్కాలని (మొదట మిల్లులుపెట్టుకోవడానికి సదుపాయాలుకావాలని)- ఇవేవారికోర్కెలు. 'బహిరాగతుల'ంటారా- బూర్జువావర్గం జనసామాన్యం సహాయంలేకుండ పోరాటాలు

# సాహిత్యం - మార్క్సిజం

సి. రామచంద్రారెడ్డి

ఆర్.యస్. సుదర్శనంగారి "మార్క్సిదృష్టిలో సాహిత్యం" వక్రీకరణకు త్రిపురనేని మధుసూదనరావుగారు యిచ్చిన సమాధానంలోని "విమర్శను చాలవరకు అంగీకరిస్తూనే వారివిమర్శపైకొన్ని ఆక్షేపణల్ని," మొత్తం విప్లవసాహిత్యంపై తీవ్ర ఆరోపణల్ని, సూత్రీకరణల్ని, సురేంద్రరాజుతన "సాహిత్యం - మార్క్సిజం" వ్యాసంలోచేశాడు.

"పరిసరాలఎరుక, తనమనస్తత్వం పనిచేసే స్వీయఃఎరుక వ్యక్తిచైతన్యం అవుతుంది, స్వీయఎరుక సామాజికఎరుకనుండి ఉత్పన్నమవుతుంది"అని మధుసూదన రావుగారు ఆర్.యస్. సుదర్శనంగారికి యిచ్చిన సమాధానంలో చెప్పటంవలన ఆయన మార్క్సిజం విమర్శించి, తిరస్కరించిన యాంత్రిక భౌతికవాదాన్ని అంగీక

---

చేయలేదని మార్క్స ఎన్నడోచెప్పాడు. జనసామాన్యంలోని జాతీయతాభావాల్ని రెచ్చగొట్టి వారిమద్దతుపొందడానికే ఈ బహిరాగతులసమస్య ముందుకుతేబడింది. ఇదినమ్మశక్యంకాదంటే ఒక్కవిషయం గుర్తుచేస్తాను. ఈశాన్యభారతంలో (అంటే ముఖ్యంగా అస్సాంలో) పారిశ్రామికాభివృద్ధికోసం ఒకప్రత్యేక మినిస్ట్రిఉండాలని, కాబినెట్‌హోదాగలమంత్రి ఉండాలని ఈమధ్య కేంద్రప్రభుత్వం ఒకనిర్ణయంతీసుకుంది. అంటే బడాబూర్జువావర్గానికి చాలదగ్గరిచుట్టమైన ఇందిరమ్మ అస్సాం ఛోటా బూర్జువావర్గానికి దానికికావలసిన లంచంపెడుతోందన్నమాట.

ఇదంతా అన్యాయంకాదు, అస్సాంఅభివృద్ధిచెందితే ఎవరికీబాధలేదు. అంతేకాకుండ, బడాబూర్జువావర్గానికి వ్యతిరేకంగా ఒక ప్రాంతీయ బూర్జువావర్గం పోరాడితే కమ్యూనిస్టులు సామాన్యప్రజలకేహానీ జరగనంతకాలం ఆ పోరాటాన్ని సమర్థించవలసిందే. అయితే పాలకవర్గాల ఈ అంతఃకలహంలో లక్షలమంది సామాన్యప్రజలు పావులైతే ఆ కలహాన్ని కమ్యూనిస్టులేవిధంగా సమర్థిస్తారు? వీరిని అస్సాంనుంచి గెంటివేస్తే వారిగతి ఎంతదుర్భరంగావుంటుందో ఊహించలేని విషయమా? ఇటువంటి పనులుచేయడంలో మనపాలకుల నేర్పరితనం మనకుతెలియందా? కేంద్రంలోని బ్యురోక్రాట్‌లకూ కలకత్తా వామపక్ష ప్రభువులకుమధ్య ఫుటబంతులుగామారిన దండకారణ్య కాందిశీకుల చరిత్ర మరిచిపోయామా?

వర్గపోరాటదృక్పథం వదిలిపెట్టి, జాతుల 'బలహీనబంధాల సంకెళ్ళ సంగీతానికి' తన్మయత్వంపొందడం బూర్జువా సాంస్కృతిక సాపేక్షవాదానికి (cultural relativism) తగునేమోగాని మార్క్సిజానికితగదు. శ్రీమతి దేవకిజైన్‌కు తగునేమోగాని, పుస్తకాన్ని 'సృజన'కు 'ఫ్రాంటియర్'కు అంకితమిచ్చిన 'సుర'కు తగదు.